ఈనాడు
పార్వతీపురం మన్యం
శనివారం అక్టోబరు 26, 2024

నిబంధనల మేరకే ఇసుక తవ్వాలి

● జడ్పీ సమావేశంలో మంత్రులు

ఈనాడు-విజయనగరం, న్యూస్‌టుడే, విజయనగరం అర్బన్

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జిల్లా పరిషత్తు సర్వ సభ్య సమావేశం రెండో సారి శుక్రవారం జరిగింది. ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ఉమ్మడి జిల్లా మంత్రులు కొండపల్లి శ్రీనివాస్, గుమ్మిడి సంధ్యారాణి, కలెక్టర్ బి.ఆర్.అంబేడ్కర్, మన్యం జిల్లా జేసీ శోభిత, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యేలు అదితి గజపతిరాజు, తోయక జగదీశ్వరి, బోనెల విజయచంద్ర, ఎమ్మెల్సీ సురేష్‌బాబు, ఉభయ జిల్లాల అధికారులు హాజరయ్యారు. అజెండాలోని తొలి అంశం నుంచే సమావేశంలో వాడీవేడిగా చర్చ సాగింది.



మాట్లాడుతున్న జడ్పీ ఛైర్మన్ శ్రీనివాసరావు, చిత్రంలో మంత్రులు సంధ్యారాణి, శ్రీనివాస్, కలెక్టర్ అంబేడ్కర్ తదితరులు

తొలుత సమావేశంలో కొందరు జడ్పీటీసీ సభ్యులు, మండలాధ్యక్షులు ఇసుక ఎక్కడా దొరకడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఇసుక నిల్వ కేంద్రాల్లో లేదని, నిర్మాణాలు ముందుకు సాగడం లేదన్నారు. ఉచితమన్నారు.. రవాణా ఛార్జీల పేరిట బాదేస్తున్నారన్నారు. నాటుబళ్లు, ట్రాక్టర్లపై సొంత అవసరాలకు తీసుకెళ్లవచ్చని మంత్రులు కొండపల్లి శ్రీనివాస్, గుమ్మిడి సంధ్యారాణి, జిల్లా కలెక్టర్ అంబేడ్కర్ స్పష్టం చేశారు. పొలాల్లో తవ్వకాలపై ఎమ్మెల్సీ సురేష్ బాబు, మండలాధ్యక్షులు ప్రస్తావించగా మంత్రులు స్పందిస్తూ.. ఎవరి పొలాల్లో వారికే తవ్వకానికి అనుమతి ఉందని, నిబంధనలు ఉల్లంఘిస్తే ఫిర్యాదులపై చర్యలు తప్పవన్నారు.

★ ఒడిశా నుంచి దిగుమతైన ఇసుక ధర కాస్త ఎక్కువగానే ఉందని, వానా కాలంలో రీచ్‌ల నుంచి తీయలేకపోయారని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. సొంత అవసరాలకు ఎక్కడైనా తవ్వుకోండి.. తీసుకెళ్లండి.. అని ప్రజలకు సూచించారు. ఎల్.కోట, వేపాడ మండలాల్లో ఎక్కడా ఇసుక లభ్యత లేదు.. మరి ఎక్కడ తవ్వుకొని, తీసుకెళ్లాలని ఎల్.కోట మండలాధ్యక్షుడు శ్రీనివాస్ ప్రశ్నించారు. నాలుగు నెలల్లో జిల్లాలో 92 వేల మెట్రిక్ టన్నుల ఇసుక ఉచితంగా సరఫరా చేశామని కలెక్టర్ బదులిచ్చారు.


హాజరైన ప్రజాప్రతినిధులు

★ కొత్తవలస మండలంలో ఉత్తరాంధ్ర సుజల స్రవంతి కాలువ రావడంతో ఇళ్ల పట్టాలు ఆపేశారని, దేవాడలో పట్టాలిచ్చినా నీటి సౌకర్యం లేక లబ్ధిదారులు నిర్మించడంలేదని జడ్పీటీసీ సభ్యురాలు శ్రీదేవి తెలిపారు. తోటపల్లి నిర్వాసితుల ఐఏవై ఇళ్ల బిల్లులు చెల్లించాలని కురుపాం జడ్పీటీసీ కోరారు.

త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు

పేదలకు మంజూరు చేసిన పక్కా ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేస్తామని గృహ నిర్మాణ సంస్థ పీడీ కూర్మినాయుడు పేర్కొన్నారు. పేదల ఇళ్ల పనులకు ఉచితంగా ఇసుక అందిస్తామని మంత్రి సంధ్యారాణి అన్నారు.

రెండు తీర్మానాలు

తాటిపూడి జలాశయానికి గొర్రెపాటి బుచ్చి అప్పారావు పేరు పెట్టాలని, గుర్ల డయేరియా బాధితులకు ప్రభుత్వ పరంగా సాయమందించాలన్న డిమాండ్ మేరకు సభలో తీర్మానించారు.

లస్కర్ల నియామకానికి సాయం

బాడంగి, తెర్లాం మండలాల్లో వరి పంటకు సాగునీరు అందించలేని పరిస్థితి నెలకొందని.. తోటపల్లి ప్రాజెక్ట్ కింద ఆయకట్టుకు నీరందించలేని పరిస్థితి ఉండకూడదని ఛైర్మన్ సహా పలువురు సభ్యులు కోరారు. జలాశయంలో నీటి మట్టం తగ్గింది.. సాగునీటికి డిమాండ్ పెరిగిందని ఈ ప్రాజెక్ట్ ఈఈ రామచంద్రరావు తెలిపారు. లస్కర్ల కొరతపై కలెక్టర్ అంబేడ్కర్ మాట్లాడుతూ రెండు మూడు నెలలు వారి నియామకానికి అయ్యే ఖర్చు సాయం అందించే ప్రయత్నం చేస్తానన్నారు.

గుర్లకు నిపుణుల కమిటీ: కలెక్టర్

గుర్లలో డయేరియా మృతులపై విచారణకు ప్రభుత్వం నలుగురు నిపుణులతో కూడిన కమిటీని నియమించిందని కలెక్టర్ అంబేడ్కర్ అన్నారు. నివేదిక అనంతరం పరిహారం చెల్లిస్తారన్నారు.

పశు సంపదతో ఆర్థికాభివృద్ధి

పార్వతీపురం గ్రామీణం, పట్టణం: జిల్లాలో పశుసంపద వృద్ధి చెంది పోషకులు ఆర్థికాభివృద్ధి సాధించాలని కలెక్టరు ఎ.శ్యామ్‌ప్రసాద్ అన్నారు. శుక్రవారం పార్వతీపురంలో పశుగణన కార్యక్రమాన్ని పశు సంవర్ధక శాఖ అధికారి మన్మథరావుతో కలిసి ప్రారంభించారు. గతంలో జిల్లాలో 2.29 లక్షల పశువులు, 0.47 లక్షల గేదెలు, 2.07 లక్షల గొర్రెలు, 1.73 లక్షల మేకలు, 8.11 లక్షల కోళ్లు కలిపి 14.67 లక్షలు ఉండేవని, ప్రస్తుతం పెరిగే అవకాశం ఉందని డీఏహెచ్‌వో తెలిపారు. అనంతరం గోడప్రతులు ఆవిష్కరించారు.


గోడప్రతులు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

వీఆర్వో సస్పెన్షన్

● తహసీల్దారు, ఆర్ఐకు శ్రీముఖాలు

పార్వతీపురం, న్యూస్‌టుడే: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వస్తున్న అర్జీల విషయంలో అశ్రద్ధ చూపిన వీఆర్వోను అధికారులు సస్పెండు చేశారు. తహసీల్దారు, ఆర్ఐకు శ్రీముఖాలు జారీ చేశామని ఇన్‌ఛార్జి డీఆర్వో జి.కేశవనాయుడు తెలిపారు. మక్కువ మండలం కొయ్యన్నపేటలో రవీంద్రనాథ్‌ఠాగూర్‌కు చెందిన భూమి వేరొకరి పేరుతో ఉంది. తనకు హక్కుపత్రాలు ఇవ్వాలని రెవెన్యూశాఖ మంత్రికి రవీంద్రనాథ్ అర్జీ పెట్టారు. దీనిపై చర్యలు చేపట్టాలని కలెక్టరేట్‌కు మంత్రి కార్యాలయం నుంచి లేఖ పంపించారు. దీనిపై మండల స్థాయిలో సక్రమంగా స్పందించకపోవడంతో కొయ్యన్నపేట వీఆర్వోను తాత్కాలికంగా తొలగించామని ఇన్‌ఛార్జి డీఆర్వో తెలిపారు.

ఆశ్రమ పాఠశాల్లో ఆకస్మిక తనిఖీ

ఈనాడు కథనానికి స్పందన

పాచిపెంట, న్యూస్‌టుడే: పాచిపెంట గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను పార్వతీపురం ఐటీడీఏ పీవో అశుతోష్ శ్రీవాస్తవ సందర్శించారు. శుక్రవారం 'ఈనాడు'లో ప్రచురితమైన 'కళ్ల ముందే కొత్త భవనం.. చదువులకు తప్పని కష్టం' శీర్షికతో ప్రచురితమైన చిత్రవార్తపై స్పందించారు. పదో తరగతి విద్యార్థినులతో మాట్లాడి పలు అంశాలపై ప్రశ్నలు వేశారు. తరగతి గదులు, మరుగుదొడ్లు, భోజన గది పరిశీలించారు. ప్రస్తుతం 371 మంది చదువుతున్నారని స్నానవాటికలు, మరుగుదొడ్ల సమస్య ఉందని హెచ్ఎం శారదాదేవి తెలియజేశారు. కొత్త భవనం ఎందుకు ప్రారంభించలేదని ప్రశ్నించారు. ఉన్నతాధికారులతో చర్చిస్తామన్నారు. తహసీల్దారు రవి, ఎంపీడీవో పాత్రో, పాఠశాల సహాయ సంరక్షకురాలు స్వర్ణలత ఉన్నారు.


బాలికలను ప్రశ్నిస్తున్న పీవో అశుతోష్ శ్రీవాస్తవ

మహిళలకు అండగా అంతర

అందుబాటులోకి ప్రత్యేక ఇంజెక్షన్

పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే: కుటుంబ నియంత్రణపై అవగాహన లేమి.. బిడ్డల మధ్య అంతరం లేకపోవడంతో గిరిజన మహిళలు అనారోగ్యం బారిన పడుతున్నారు. కొందరు నాలుగు, అయిదో సంతానానికి ఆసుపత్రులకు రావడం.. వారిలో తీవ్ర రక్తలేమి సమస్యలు చూసి వైద్యులే ఆశ్చర్యానికి గురవుతున్నారు. అత్యవసర సమయాల్లో రక్తం ఎక్కించి ప్రసవం చేయాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి. ముఖ్యంగా గిరిజన మహిళలు బిడ్డల మధ్య అంతరం పాటించకపోవడంతో వివిధ రకాలు సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం వారి కోసం 'అంతర' పేరుతో ప్రత్యేక గర్భ నిరోధక ఇంజెక్షన్ అందుబాటులోకి తీసుకొచ్చింది.


జిల్లా ఆసుపత్రిలో ఉన్న ఇంజెక్షన్లు

అవగాహన అంతంతే..

జిల్లాలో అన్ని రకాల ప్రభుత్వ ఆసుపత్రులు కలిపి 49 ఉన్నాయి. వీటిలో నెలకు 12 వేల వరకు ప్రసవాలు జరుగుతాయి. ఇక్కడకు వచ్చే వారిలో మూడొంతుల మంది గిరిజనులే. చాలా మందికి నలుగురు నుంచి ఆరుగురు వరకు సంతానం ఉంటున్నారు. అవగాహన లేక తాత్కాలిక కుటుంబ నియంత్రణ పద్ధతులు పాటించడం లేదని వైద్యులు గుర్తించారు. ఈ ఇంజెక్షన్‌తో మేలని చెబుతున్నారు. ఇప్పటివరకు 15 మందికి వేసినట్లు తెలిపారు.

మూడు నెలల వరకు..

ఈ ఇంజెక్షన్లు గిరిజనులకు వరం లాంటివి. తాత్కాలిక కుటుంబ నియంత్రణకు ఉపయోగపడే ఇంజెక్షన్లతో ఎలాంటి ఆరోగ్య సమస్యలు ఉండవని వైద్యులు చెబుతున్నారు. అవగాహన లోపంతో దగ్గర దగ్గర సంతానానికి చెక్ పెట్టొచ్చన్నారు. జిల్లా ఆసుపత్రిలోని పీపీ యూనిట్‌లో ప్రస్తుతం అందుబాటులో ఉన్నాయి. తాత్కాలిక కు.ని. పద్ధతులు పాటించేందుకు కొందరు వివిధ మాత్రలు వినియోగిస్తున్నారు. ఫలితం ఉండడం లేదు. కానీ అంతర ఇంజెక్షన్‌తో మూడు నెలల వరకు గర్భం దాల్చే అవకాశం ఉండదు.

బాలింతలకు సురక్షితం..

అంతర ఇంజెక్షన్‌తో బాలింతలకు ఎక్కువ సురక్షితం. గిరిజనుల్లో బిడ్డ పుట్టాక రెండో సంతానానికి ఎక్కువ సమయం తీసుకోవడం లేదు. ఈ ఇంజెక్షన్ ఇస్తే మూడు నెలల పనిచేస్తుంది. మరోసారి వేయించుకోవచ్చు. దీనిపై వారికి అవగాహన కల్పిస్తున్నాం.

– విజయమోహన్, వైద్యాధికారి, పీపీ యూనిట్

పోలీసుల సేవలపై అవగాహన


పోలీసులు వాడే పరికరాలను పరిశీలిస్తున్న విద్యార్థులు


తుపాకీతో విద్యార్థిని, చిత్రంలో ఎస్పీ, ఏఎస్పీ

శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా పోలీసులు అందించే సేవలు, ఉపయోగించే ఆయుధాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విజయనగరంలోని పోలీసు పరేడ్ మైదానంలో శుక్రవారం నిర్వహించిన 'ఓపెన్ హౌస్' కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా ఉన్న పలు విద్యా సంస్థల నుంచి విద్యార్థులు తరలివచ్చారు. కేసుల ఛేదనలో ఉపయోగించే సాంకేతికత, కమ్యూనికేషన్ స్కిల్స్, డిటెక్షన్, డిస్పోజల్, వివిధ ఆయుధాలు, డ్రోన్ల ఉపయోగం, వేలిముద్రల సేకరణ, బాడీవార్న్ కెమెరాలు, లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్, బ్రీత్ ఎనలైజర్లు, స్పీడ్ గన్‌లు.. తదితర వాటి గురించి ఎస్పీ వకుల్ జిందాల్ వివరించారు. అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా ఉద్యోగులు, పోలీసుల పిల్లలు, ఇతర విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. అదనపు ఎస్పీ పి.సౌమ్యలత తదితరులు పాల్గొన్నారు.

– న్యూస్‌టుడే, విజయనగరం నేరవార్తా విభాగం

'రెండేళ్లలో ఒక్క రూపాయి ఇవ్వలేదు'


జడ్పీ కార్యాలయానికి ర్యాలీగా తరలి వెళుతున్న విద్యార్థులు

విజయనగరం విద్యావిభాగం, న్యూస్‌టుడే: గత ప్రభుత్వ హయాంలో పెండింగ్‌లో ఉన్న విద్య, వసతి దీవెన, ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని కోరుతూ భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో విద్యార్థులు శుక్రవారం ఆందోళనకు దిగారు. తొలుత చలో కలెక్టరేట్‌కు పిలుపునిచ్చిన వారు.. జడ్పీ సర్వసభ్య సమావేశం నేపథ్యంలో అప్పటికప్పుడు వేదికను మార్చారు. ఆర్టీసీ సముదాయం నుంచి ర్యాలీగా జడ్పీ కార్యాలయానికి చేరుకుని ముట్టడించే ప్రయత్నం చేశారు. పోలీసులు వారిని లోనికి వెళ్లనీయకుండా అడ్డుకోవడంతో రహదారిపై బైఠాయించారు. సుమారు గంట పాటు నిరసన తెలిపారు. అనంతరం మంత్రులు శ్రీనివాస్, సంధ్యారాణి, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యేలు జగదీశ్వరి, అదితి గజపతిరాజు, కలెక్టర్ అంబేడ్కర్ వచ్చి వారితో చర్చించారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో విరమించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు డి.రాము, ఉపాధ్యక్షుడు రవికుమార్, సహాయ కార్యదర్శి ఎస్.సమీరా, శిరీష, కె.రమేష్, పి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.


ఎస్ఎఫ్ఐ నాయకులతో మాట్లాడుతున్న పోలీసులు

జిల్లాకు రెండు కుంకీ ఏనుగులు

పార్వతీపురం గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లాలో ఏనుగులు సంచరిస్తున్న ప్రాంతంలో మరణాలు పునరావృతం కాకుండా అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డీఎఫ్‌వో ప్రసూన ఆదేశించారు. శుక్రవారం పార్వతీపురం, పాలకొండ రేంజర్లు రామ్‌నరేష్, జగన్నాథం, మణికంఠేష్‌తో సమీక్షించారు. జిల్లాకు రెండు కుంకీ గజరాజులు మంజూరయ్యాయని, వాటిని అదుపు చేసేందుకు ఇద్దరికి శిక్షణ ఇస్తామన్నారు. నవంబరులో నంద్యాలలో, తర్వాత కర్ణాటకలోని దుబ్రిలో రెండు నెలలపాటు తర్ఫీదు ఉంటుందని చెప్పారు. అనంతరం పెదబొండపల్లిలో కరిరాజుల దాడిలో మృతిచెందిన యాకోబు కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఇప్పటివరకు 12 మంది ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏనుగులను కవ్వించొద్దని, వాటికి 200 మీటర్ల దూరంలో ఉండాలని హెచ్చరించినా జనం పట్టించుకోవడం లేదని డీఎఫ్‌వో పేర్కొన్నారు.

ముగిసిన అంతర కళాశాలల పోటీలు


క్రీడాకారులతో నిర్వాహకులు

పాలకొండ, గ్రామీణం న్యూస్‌టుడే: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ చూపాలని పాలకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రధానాచార్యుడు ఎం.శ్యామ్‌బాబు పేర్కొన్నారు. శ్రీకాకుళం జిల్లా అంబేడ్కర్ విశ్వవిద్యాలయం పరిధిలో గత మూడు రోజులుగా జరుగుతున్న అంతర కళాశాలల పోటీలు శుక్రవారంతో ముగిశాయి. కళాశాల పూర్వవిద్యార్థుల సంఘం కార్యదర్శి పల్లా కొండబాబు మాట్లాడుతూ.. గెలుపు, ఓటములు సమానంగా స్వీకరించి, ముందుకెళ్లాలన్నారు. కబడ్డీలో పాలకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ద్వితీయ స్థానంలో నిలిచింది. బాలికల విభాగంలో సీతంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రథమ, పాలకొండ కళాశాల ద్వితీయ స్థానం సాధించింది. వర్సిటీ క్రీడా బోర్డు కార్యదర్శి ఎ.శ్రీనివాసరావు, ఉపప్రధానాచార్యురాలు బి.జయమణి, పోటీల బాధ్యులు బి.రాజు, ఎస్.సీతారామ్, ఎంఈవో సోంబాబు, వ్యాయామ ఉపాధ్యాయులు రామక్రిష్ణ, పుష్పనాథం, రాములు, రమణ, చౌదరినాయుడు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగుల క్రీడలు

పార్వతీపురం, న్యూస్‌టుడే: జిల్లా అధికారులు, ఉద్యోగులకు ఈనెల 30న క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు క్రీడాభివృద్ధి అధికారి వెంకటేశ్వరరావు తెలిపారు. అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, క్యారమ్స్, చదరంగం, క్రికెట్, ఫుట్‌బాల్, ఖోఖో, హాకీ, కబడ్డీ, టెన్నిస్, పవర్ లిఫ్టింగ్, వెయిట్ లిఫ్టింగ్, టేబుల్ టెన్నిస్, వాలీబాల్, రెజ్లింగ్, స్విమ్మింగ్ పోటీలు ఉంటాయన్నారు. ఆర్సీఎం పాఠశాల ఆవరణలో 30న ఉదయం 9 గంటల నుంచి ఎంపికలు ఉంటాయని, గుర్తింపు కార్డులతో రావాలన్నారు. ఇక్కడ ప్రతిభ చూపిన వారు నవంబరు 6 నుంచి 9 వరకు జరిగే రాష్ట్రస్థాయి టోర్నమెంట్లలో పాల్గొంటారన్నారు.

నీటి సంఘాల ఎన్నికలకు వేళాయె!!

పార్వతీపురం, న్యూస్‌టుడే

నిర్వహణకు ఏర్పాట్లు ప్రారంభం

సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు ప్రక్రియ ప్రారంభమైంది. ఇందులో భాగంగా నీటి సంఘాన్ని ఎంత విస్తీర్ణానికి పరిమితం చేయాలో గుర్తించే కార్యక్రమాన్ని జలవనరుల శాఖ చేపట్టింది. ఈనెల 22న ప్రారంభమైన ఆయకట్టు వారీగా విస్తీర్ణం గుర్తింపు 30 వరకు సాగనుంది. జిల్లాకు సంబంధించి పార్వతీపురం జలవనరులశాఖ డివిజన్ పరిధిలో 1098 ప్రాదేశిక స్థానాలు, శ్రీకాకుళం డివిజన్ పరిధిలో ఉన్న పాలకొండ నియోజకవర్గం పరిధిలో 462 ప్రాదేశిక స్థానాలకు విస్తీర్ణం వారీగా ఓటర్లను గుర్తించే కార్యక్రమం జలవనరుల శాఖ, రెవెన్యూ శాఖ నిర్వహిస్తున్నాయి. గతంలో సర్వే నంబర్ల వారీగా ఉన్న వివరాలను ప్రాతిపదికగా తీసుకొని గుర్తిస్తున్నారు. ఓటర్ల జాబితాను రెవెన్యూశాఖ తయారు చేస్తోంది. ఈనెల 31న ప్రాదేశిక నియోజకవర్గాల వారీగా వివరాలను జలవనరుల శాఖ కార్యనిర్వాహక ఇంజినీరు ప్రకటించనున్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి.


తోటపల్లి జలాశయం

ఓటరు జాబితా

ఆయకట్టు భూముల్లో సాగుదారులే ఓటర్లుగా ఉంటారు. భూ యాజమానుల జాబితాతో పాటు నీటిని ఇతరత్రా వినియోగిస్తున్న వారి వివరాలను పరిగణనలోకి తీసుకుంటారు. నవంబరు 6 నుంచి 10 వరకు ఈ ప్రక్రియ సాగుతుంది. ఈ జాబితాలను పంచాయతీలు, మండల కార్యాలయాల్లో ప్రకటిస్తారు. పరిశీలించిన తర్వాత నవంబరు 11, 12 తేదీలలో అభ్యంతరాలకు అవకాశం కల్పిస్తారు. అనంతరం 13న తుది జాబితాను ప్రకటించనున్నారు. 20న ఎన్నికలను నిర్వహించనున్నారు. నవంబరు 21 నుంచి 29 వరకు వివిధ స్థాయిల్లో ఎన్నికైన నీటి వినియోగదారుల సంఘాల సభ్యులతో సర్వసభ్యసమావేశాలు నిర్వహించేలా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

రెండు రోజుల్లో..

ప్రకటించిన ప్రాదేశిక ప్రాంతాల జాబితాపై ఏవైనా అభ్యంతరాలుంటే నవంబరు 1, 2వ తేదీలలో తెలియజేసే వీలు కల్పించారు. వీటిని జలవనరుల శాఖ అధీకృత అధికారిగా కార్యనిర్వాహక ఇంజినీరు నవంబరు 3న పరిశీలించి, అదే రోజు తుది జాబితాను విడుదల చేస్తారు.

డిస్ట్రిబ్యూషన్ కమిటీలు..

ఒక్కో డిస్ట్రిబ్యూషన్ కమిటీలో ఎన్ని ప్రాదేశిక ప్రాంతాలు ఉండాలి అనే అంశాన్ని నవంబరు 3న నిర్ణయిస్తారు. వీటిని కలెక్టర్ల సూచనలతో పర్యవేక్షక ఇంజినీరు ప్రకటిస్తారు. అభ్యంతరాలను కలెక్టరు లేదా జలనవరుల శాఖ కమిషనరు నియమించిన అధీకృత అధికారి ఎవరైనా పరిశీలించే అవకాశంఉంది.

ప్రక్రియ కొనసాగుతోంది..

'ప్రస్తుతం నీటి సంఘాల పరిధిని గుర్తించే ప్రక్రియ జరుగుతోంది. దీనిపై ఇంజినీరింగు అధికారులు కసరత్తు చేస్తున్నారు. నిర్ణీత కాలవ్యవధిలో పూర్తిచేసేందుకు చర్యలు చేపడుతున్నాం' అని జలవనరులశాఖ కార్యనిర్వాహక ఇంజినీరు అప్పలనాయుడు 'న్యూస్‌టుడే'కు తెలిపారు.

సీఎం సహాయనిధికి రూ.1.03 లక్షల విరాళం


కలెక్టర్‌కు చెక్కు అందిస్తున్న వీసీ, రిజిస్ట్రార్

విజయనగరం విద్యావిభాగం, న్యూస్‌టుడే: విజయవాడ వరద బాధితుల సహాయార్థం జేఎన్‌టీయూ గురజాడ విద్యాలయం అధ్యాపకులు, సిబ్బంది ఒక రోజు వేతనం రూ.1.03 లక్షలను విరాళంగా ప్రకటించారు. ఈ మొత్తాన్ని చెక్కు రూపంలో శుక్రవారం కలెక్టర్ అంబేడ్కర్‌కు ఇన్‌ఛార్జి ఉపకులపతి డి.రాజ్యలక్ష్మి, రిజిస్ట్రార్ జయసుమ, ఉప రిజిస్ట్రార్ కె.గంగరాజు అందజేశారు.

త్వరలో నైపుణ్య కేంద్రం

విజయనగరం విద్యావిభాగం, న్యూస్‌టుడే: విజయనగరంలోని జేఎన్‌టీయూ గురజాడ విశ్వవిద్యాలయంలో త్వరలో నైపుణ్య కేంద్రాన్ని ప్రారంభిస్తామని రాష్ట్ర పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాలశాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ హామీ ఇచ్చారు. ఇన్‌ఛార్జి ఉప కులపతి డి.రాజ్యలక్ష్మి, రిజిస్ట్రార్ జి.జయసుమ శుక్రవారం సాయంత్రం ఆయనను కలిసి అభ్యర్థించిన మేరకు సానుకూలంగా స్పందించారు. ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

పోలీసులకు వ్యాసరచన పోటీలు


పర్యవేక్షిస్తున్న ఏఎస్పీ దిలీప్ కిరణ్

పార్వతీపురం పట్టణం: పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఎస్పీ కార్యాలయంలో పోలీసులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ప్రస్తుత సమాజంలో ఎదుర్కొంటున్న సవాళ్లు అనే అంశంపై జరిగాయి. ఏఎస్పీ దిలీప్‌కిరణ్, ఎస్సైలు ఫక్రుద్దీన్, దినకర్, డీసీఆర్బీ సిబ్బంది పర్యవేక్షించారు. ప్రతిభ చూపిన వారికి బహుమతులు, ప్రశంసాపత్రాలు అందిస్తామని ఏఎస్పీ పేర్కొన్నారు.

చికెన్ ధరలు

రకం	(బ్యాగ్)లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	122	214	224

శవ రాజకీయాలు చేయడం తగదు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కళా వెంకటరావు

చీపురుపల్లి, న్యూస్‌టుడే: గుర్లలో అతిసారానికి సంబంధించి శవ రాజకీయాలు చేయడం వైకాపాకు తగదని ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు అన్నారు. చీపురుపల్లిలోని పార్టీ కార్యాలయంలో ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి గుర్ల వచ్చి వీరంగం సృష్టించడం దారుణమన్నారు. ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పంచాయతీలకు నిధులు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. 90 శాతం వైకాపా వాళ్లే సర్పంచులుగా ఉన్నారని, పంచాయతీలకు కూటమి ప్రభుత్వం నిధులు విడుదల చేశాక మీరేం చేశారని నిలదీశారు. లేనిపోని ప్రకటనలు చేస్తున్న జడ్పీ ఛైర్మన్‌కు బాధ్యత లేదా అని నిలదీశారు. ఈనెల 24 నాటికి జిల్లాలో రూ.126 కోట్ల నిధులు పంచాయతీల్లో అందుబాటులో ఉన్నాయన్నారు. ఏం చేసినా ప్రజలు మిమ్మల్ని నమ్మే పరిస్థితి లేదన్నారు. గుర్లలో మొదటి రోజు నుంచి ఉన్నతాధికారులు, దిగువ స్థాయి సిబ్బంది వరకు యంత్రాంగమంతా బాగా పనిచేసి అతిసారాన్ని నియంత్రించారన్నారు. నియోజకవర్గంలో రహదారుల మరమ్మతులకు ర.భ.శాఖ ద్వారా రూ.11 కోట్లు మంజూరయ్యాయని, తోటపల్లి కుడి ప్రధాన కాలువలో పూడికల తొలగింపునకు రూ.58 లక్షలు కేటాయించినట్లు చెప్పారు. నాయకులు కుచ్చర్లపాటి త్రిమూర్తుల రాజు, రౌతు కామునాయుడు, దన్నాన రామచంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

తేనెటీగల దాడిలో వృద్ధుడి దుర్మరణం


పి.చెల్లయ్య (పాతచిత్రం)

కొత్తవలస, న్యూస్‌టుడే: తేనెటీగలు ఓ వృద్ధుడి ప్రాణం తీశాయి. ఈ ఘటన కొత్తవలస మండలం రాజపాత్రునిపాలెంలో జరిగింది. ఏఎస్సై జనార్దనరావు వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పి.చెల్లయ్య(74) ఈనెల 21న ఉదయం పశువులను మేత కోసం సమీపంలోని మామిడితోటలోకి తీసుకువెళ్లారు. ఈక్రమంలో తేనెటీగల గుంపు దాడి చేసింది. కుటుంబ సభ్యులు వెంటనే విశాఖలోని కేజీహెచ్‌కు తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. అతని భార్య అచ్చియ్యమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు. అచ్చియ్యమ్మపై కూడా దాడి చేయగా రెండు రోజుల పాటు చికిత్స పొంది కోలుకున్నారు.

ట్రాక్టరు నుంచి జారిపడి ఇంటిపెద్ద మృత్యువాత

చీపురుపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రమాదవశాత్తు ట్రాక్టరు పైనుంచి జారిపడి చోదకుడు మృతిచెందిన ఘటన చీపురుపల్లి మండలం పేరిపిలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పి.అప్పలనాయుడు (45) శుక్రవారం సాయంత్రం సమీపంలోని పొలంలో ట్రాక్టరుతో దున్నుతుండగా ఒక్కసారిగా జారిపడ్డారు. తీవ్ర గాయాలు కావడంతో.. అక్కడివారు చీపురుపల్లి ప్రాంతీయాసుపత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతిచెందారు. అతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఘటనకు సంబంధించి వివరాలు సేకరిస్తున్నామని పోలీసులు తెలిపారు.

చోరీ కేసులో నిందితుల అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న ఎస్సై లోకేశ్వరరావు

గరివిడి, న్యూస్‌టుడే: గరివిడిలోని గర్భాం రోడ్డు ప్రాంతంలో తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీకి పాల్పడిన ఇద్దరు నిందితులను అరెస్టు చేసి, సొత్తు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై లోకేశ్వరరావు శుక్రవారం తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. గర్భాం శివారులో నివాసముంటున్న సీహెచ్.రమణమూర్తి ఈనెల 15న కుటుంబంతో కలిసి విజయనగరంలోని కుమార్తె ఇంటికి వెళ్లారు. 21న పనిమనిషి ఇంటి చుట్టూ పరిసరాలు శుభ్రం చేసేందుకు వెళ్లగా ప్రధాన ద్వారం తాళాలు పగులుగొట్టి ఉండడాన్ని చూసి యజమానికి ఫోన్ చేసి చెప్పింది. ఆయన వచ్చి చూడగా పడక గదిలోని బీరువాలో బంగారం, వెండి వస్తువులు, నగదు, మరో గదిలోని టీవీ చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేసిన అనంతరం నిందితులు డి.జగదీష్, బి.సోమశేఖర్‌ను విజయనగరంలోని ఫూల్‌బాగ్ కాలనీ వద్ద పట్టుకున్నామని ఎస్సై చెప్పారు. నేరం అంగీకరించారని, ఈ కేసులో మరో బాలుడు కూడా ఉన్నట్లు వెల్లడించారు.

స్నానాల గదిలో కాలు జారి వైద్యుడి మృతి

నేరవార్త విభాగం: ప్రమాదవశాత్తూ కాలుజారి పడడంతో ఓ వైద్య నిపుణుడు మృత్యువాత పడిన ఘటన విజయనగరంలో జరిగింది. గ్రామీణ ఎస్సై అశోక్‌కుమార్ వివరాల ప్రకారం.. ఏలూరు జిల్లాకు చెందిన పవన్‌కుమార్(44) నెల్లిమర్ల సమీపంలోని మిమ్స్‌లో అసిస్టెంటు ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. స్థానిక ఊటగెడ్డ సమీపంలోని ఓ అపార్టుమెంటులో తల్లిదండ్రులతో నివాసం ఉంటున్నారు. ఈనెల 24న స్నానాల గదిలో కాలు జారి పడ్డారు. తలకు దెబ్బ తగలడంతో మిమ్స్‌కు తరలించగా.. అదే రోజు రాత్రి చనిపోయారు. కేసు నమోదు చేశామని ఎస్సై చెప్పారు.

చోదకుడి అప్రమత్తత.. తప్పిన ముప్పు

కలెక్టరేట్ ప్రాంగణం, న్యూస్‌టుడే: గుండె పోటుకు గురైన బస్సు చోదకుడి అప్రమత్తతో పెను ప్రమాదం తప్పింది. పార్వతీపురం నుంచి కేదారిపురానికి 22 మంది ప్రయాణికులతో శుక్రవారం ఆర్టీసీ బస్సు బయలుదేరింది. గరుగుబిల్లి మండలంలోని నందివానివలస వద్ద చోదకుడు టి.కృష్ణకు గుండెలో నొప్పి వచ్చింది. తీవ్ర అస్వస్థతకు గురైన ఆయన చాకచక్యంగా రోడ్డు పక్కన వాహనాన్ని నిలిపి ప్రయాణికులకు విషయం చెప్పారు. వారు 108కు సమాచారం ఇవ్వడంతో పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి విజయనగరం తీసుకెళ్లారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు అధికారులు తెలిపారు.

అధ్యక్షా.. మేమూ సిద్ధం

గుమ్మలక్ష్మీపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ శ్రీవరం ఆధ్వర్యంలో శుక్రవారం నమూనా పార్లమెంటు కార్యక్రమం నిర్వహించారు. సభాపతి, ప్రధానమంత్రి, అధికార, ప్రతిపక్ష నాయకులు, కావాల్సిన యంత్రాంగంతో శీతాకాలం సమావేశాలు ఏర్పాటు చేశారు. ప్రతిపక్షం అడిగిన ప్రశ్నలు, అధికార పార్టీ ఇచ్చే సమాధానాలు, వాకౌట్ చేసే విధానంపై విద్యార్థులు వివరించి ఆకట్టుకున్నారు. వైస్ ప్రిన్సిపల్ రామయ్య, అధ్యాపకులు శ్రీవాణి, కృష్ణ, కల్పన పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, గుమ్మలక్ష్మీపురం



ఇలా వదిలేస్తే ఎలా?



పైపులైన్ల మరమ్మతుల కోసం తవ్వుతున్న గోతులు పూడ్చకుండా వదిలేయడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. పట్టణంలోని రథంవీధి, రాజుగారి కోట సంధు ఎదురుగా నిర్వహణ పనుల కోసం తవ్విన గుంతలు పూడ్చలేదు. దీంతో నీటితో నిండిపోయాయి. రాత్రి వేళల్లో గొయ్యిని గుర్తించకపోతే పడిపోయే ప్రమాదం ఉంది. పది రోజులుగా ఇలానే వదిలేశారని, పూడ్చాలని స్థానికులు కోరుతున్నారు. విషయం ఏఈ సన్యాసిరావు వద్ద ప్రస్తావించగా.. గుంతలు పూడుస్తామన్నారు.
– న్యూస్‌టుడే, పార్వతీపురం పురపాలిక

విద్యార్థులకు చేరని శుద్ధజలం



సీతానగరం మండలంలోని జోగింపేట కేజీబీవీలో ఏర్పాటు చేసిన శుద్ధ జల యంత్రం పాడైంది. దీంతో ఇక్కడ చదువుతున్న 230 మంది విద్యార్థినులు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. నెల రోజుల క్రితం పాడవగా బాగు చేశారు. అయినప్పటికీ రెండు రోజులకే మళ్లీ మరమ్మతులకు గురై మొరాయించింది. బాలికలకు గొట్టపు బావి నీరు అందిస్తున్నామని, యంత్రం బాగు చేస్తామని ప్రత్యేకాధికారిణి జె. సంధ్య తెలిపారు. – న్యూస్‌టుడే, సీతానగరం

పొంచిఉన్న ప్రమాదం



కురుపాం మండలంలోని కొండబారిడి కూడలి వద్ద నున్న ప్రయాణికుల విశ్రాంతి భవనం ఇది. పూర్తిగా శిథిలమై ఓ వైపు కూలిపోయింది. మొండెంఖల్లు, నీలకంఠాపురం, గుమ్మలక్ష్మీపురం గ్రామాలకు వెళ్లే ప్రయాణికులు ఇక్కడే వేచి ఉండాలి. ప్రస్తుతం దీని పరిస్థితి ప్రమాదకరంగా మారడంతో వారు ఆందోళన చెందుతున్నారు. కొత్తది నిర్మించాలని కోరుతున్నారు. శిథిల భవనం తొలగించి, కొత్తది కడతామని ర.భ.శాఖ అధికారులు తెలిపారు. – న్యూస్‌టుడే, కురుపాం గ్రామీణం

అధ్వాన పరిసరాలతో అవస్థలు

సాలూరు మండలం నెలిపర్తి పంచాయతీ కేంద్రంలోని పాఠశాల, అంగన్‌వాడీ, కుళాయిల పరిసరాలు అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. గతంలో ఇక్కడ నిర్మించిన కాలువ పూర్తిగా పూడుకుపోయింది. దీంతో మురుగు రహదారిపై నిలిచిపోతోంది. దోమలు విజృంభిస్తున్నాయని, వ్యాధులతో ఇబ్బంది పడుతున్నామని స్థానికులు చెబుతున్నారు. దీనిపై ఎంపీడీవో రమాదేవి వివరణ కోరగా.. పరిశీలించి, చర్యలు తీసుకుంటామని చెప్పారు.
– న్యూస్‌టుడే, సాలూరు గ్రామీణం



ఈ దారిలో ప్రయాణం నరకం



పాలకొండ పట్టణ శివారులో జగన్నాథ స్వామి ఆలయం నుంచి సింగన్నవలస కూడలి మీదుగా ఉన్న రహదారి రాళ్లు తేలిపోయింది. సీతంపేట, కొత్తూరుతో పాటు శ్రీకాకుళం వైపు వెళ్లాలంటే ఇదే మార్గం. వెలగవాడ, సింగన్నవలస, పరశురాంపురం, ఎన్‌.కె.రాజపురం ప్రాంతాల నుంచి ఆలయానికి వచ్చే వారు అవస్థలు పడుతున్నారు. దీనిపై నగర పంచాయతీ కమిషనర్ సర్వేశ్వరరావు వద్ద ప్రస్తావించగా.. కొంతభాగం బాగు చేశామని, మిగిలిన పనులు పూర్తి చేస్తామని తెలిపారు.
– న్యూస్‌టుడే, పాలకొండ గ్రామీణం

బాధిత కుటుంబానికి రూ.10 లక్షలు



నగదు చెక్కు ఇస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర

పార్వతీపురం గ్రామీణం, న్యూస్‌టుడే: ఏనుగుల దాడిలో మృతి చెందిన యాకోబు కుటుంబానికి గంటల వ్యవధిలో పరిహారం అందించేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుందని ఎమ్మెల్యే బి.విజయచంద్ర అన్నారు. శుక్రవారం పెదబొండపల్లిలో మృతుని భార్య, పిల్లలకు రూ. 10 లక్షల చెక్కును డీఎఫ్‌వో ప్రసూనతో కలిసి అందజేశారు. ప్రజలకు కష్టం వస్తే చంద్రన్న స్పందిస్తారని, ఘటన గురించి చెప్పగానే ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ అధికారులను అప్రమత్తం చేశారని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

(10 AM TO 1 PM)

పార్వతీపురం	8008566244
పాలకొండ	8008574299
సాలూరు	8008786820
కురుపాం	9849044696

? పాచిపెంట పాఠశాల ఆవరణలో బోరు పాడైంది. విద్యార్థులు భోజన సమయంలో ఇబ్బందులు పడుతున్నారు. **- తల్లిదండ్రులు**

• ఇటీవల బాగు చేశాం. మళ్లీ మరమ్మతులకు గురైంది. **- రామాంజనేయులు ర.భ.శాఖ జేఈ** – న్యూస్‌టుడే, పాచిపెంట

? కురుపాం ప్రధాన రక్షిత తాగునీటి పథకం ద్వారా వచ్చే నీరు కలుషితం అవుతోంది. క్లోరినేషన్ చేయించాలి. **- చిన్నారావు**

• క్లోరినేషన్ చేయించి, సమస్య పరిష్కరిస్తాం. **- ఆర్‌.వేణు, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ** – న్యూస్‌టుడే, కురుపాం గ్రామీణం

? పాపమ్మవలస రామమందిరం వీధిలో పశువులను రహదారిపై కట్టడంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. **- సూర్యనారాయణ**

• పరిశీలించి యజమానులపై చర్యలు తీసుకుంటాం. **- పైడిరాజు, కార్యదర్శి** – న్యూస్‌టుడే, సీతానగరం

? పెదబొండపల్లి సచివాలయానికి తెలగ, ఎస్సీకాలనీల నుంచి వచ్చే దారిలో పనికిరాని మొక్కలు పెరిగిపోయాయి. **- స్థానికులు**

• పరిశీలించి రహదారిని శుభ్రం చేయిస్తాం. **- జీవీఆర్‌.మూర్తి, ఈవోపీఆర్డీ** – న్యూస్‌టుడే, పార్వతీపురం గ్రామీణం

గంజాయి అడ్డుకట్టకు చర్యలు

పాచిపెంట, న్యూస్‌టుడే: అంతర్రాష్ట్రాల నుంచి వచ్చే గంజాయి, నాటుసారాను అడ్డుకట్ట వేసేందుకు పోలీసుశాఖ పటిష్ఠ చర్యలు చేపట్టింది. ఆంధ్ర, ఒడిశా సరిహద్దు మండలం పాచిపెంటలోని పి.కోనవలస చెక్‌పోస్టు వద్ద సాలూరు సీఐ రామకృష్ణ ఆధ్వర్యంలో శుక్రవారం మాక్‌డ్రిల్ నిర్వహించారు. అక్రమ రవాణా గుర్తింపునకు డ్రోన్, శునకాన్ని వినియోగించి వాహనాలను తనిఖీ చేశారు. చేశారు. ఎస్సై వెంకటసురేష్, పోలీసులు పాల్గొన్నారు.

చెరకు తోట దగ్ధం

జియ్యమ్మవలస, న్యూస్‌టుడే: మండలంలోని కుందరతిరువాడకు చెందిన ఎం.పెద్దినాయుడు 2 ఎకరాల చెరకు తోట గురువారం అర్ధరాత్రి దగ్ధమైంది. గ్రామస్థులు, రైతులు మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. పొలాన్ని రెవెన్యూ, ఉద్యాన అధికారులు పరిశీలించి పరిహారం అందించాలని బాధిత రైతు కోరారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



పాలకొండ, న్యూస్‌టుడే: పాలకొండ కస్పా వీధికి చెందిన యామల **అభిషేక్** జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యాడు. అనంతపురంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో బంగారు పతకం గెలుచుకున్నాడు. ఉత్తరప్రదేశ్‌లో జరగనున్న పోటీలకు అర్హత సాధించాడు.

బైపాసు కాలనీలో.. మురుగు, అంధకారం



బైపాసు కాలనీలోని ఆంజనేయ గుడి ఎదురుగా ఉన్న వీధిలో కాలువ ఇది. కొన్ని నెలలుగా మురుగుతో నిండిపోయి దుర్గంధం వ్యాపిస్తోంది. వర్షం పడితే నీరు నిల్వ చేరి పక్కనున్న ఇళ్లలోకి వెళ్తోంది. దీంతో దోమలు విజృంభిస్తున్నాయి.

పార్వతీపురం పట్టణంలోని బైపాసు కాలనీలో సమస్యలు తాండవిస్తున్నాయి. ఇక్కడ సుమారు 300 వరకు కుటుంబాలు ఉన్నా వసతుల కల్పన అంతంతమాత్రంగానే ఉంది. స్థానిక ప్రజలకు సక్రమంగా కుళాయి నీరు కూడా అందడం లేదు. రెండు, మూడు రోజులకు ఒకసారి సరఫరా కావడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. – న్యూస్‌టుడే, పార్వతీపురం పట్టణం



తుప్పలతో నిండిన కల్వర్టు

వర్షం పడితే ముంపే..

చిన్నపాటి వర్షం పడినా పట్టణ నడిబొడ్డులో ఉన్న బైపాసు కాలనీ ముంపునకు గురవుతోంది. గెడ్డ ప్రవాహం ఎక్కువగా ఉంటే మూడు, నాలుగు వీధుల్లోని ఇళ్లలోకి నీరు చేరుతుంది. కాలనీలోని ఎస్సీ బాలుర వసతి గృహంలోకి ప్రవాహం వెళ్తుంది. ప్రధాన కాలువలు అధ్వానంగా మారాయి. కొన్ని నెలలుగా పూడిక తీయక మురుగు పేరుకొని దోమలు వ్యాపిస్తున్నాయి. కాలనీ నుంచి వాడుక నీరు బయటకు వెళ్లే కల్వర్టులు మూసుకుపోయాయి. పక్కనే ఉన్న రామనందనగర్‌లోనూ ఇదే పరిస్థితి.

దీపాలు వెలగవు..

ఇక్కడ రెండు, మూడు వీధుల్లో దీపాలు వెలగడం లేదు. రాత్రి వేళల్లో చీకట్లు అలముకుంటున్నాయి. బయట వారు కాలనీకి రావాలన్నా, స్థానికులు బయటకు వెళ్లాలన్నా భయపడుతున్నారు. విష జంతువుల సంచారం ఎక్కువగా ఉండటంతో ఇబ్బంది పడుతున్నారు. దీనిపై పురపాలక సంఘం ఏఈ సన్యాసిరావు మాట్లాడుతూ.. బైపాసు కాలనీలో సమస్యల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నామన్నారు. కాలువల్లో పూడికలు తొలగిస్తామని, వీధి దీపాలు వెలిగేలా చూస్తామన్నారు.

ప్రతిభకు ప్రశంసలు





పార్వతీపురం పట్టణంలోని కొత్తవలస కేపీఎం పురపాలక పాఠశాలలో శుక్రవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 'అంతర్జాల వినియోగం వల్ల కలిగే లాభనష్టాలు, విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం' అనే అంశంపై 8, 9, 10 తరగతుల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు జరిగాయి. ఇలాంటి రచనలతో విద్యార్థుల్లో సామాజిక అంశాలపై అవగాహన కలుగుతుందని ప్రధానోపాధ్యాయుడు వై.అప్పలనాయుడు అన్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన డి.హేమ (పదో తరగతి), ఎస్‌.కె.సాజిత (ఎనిమిదో తరగతి), జి.నవ్య (తొమ్మిదో తరగతి)కు ఉపాధ్యాయులు సత్యనారాయణ, లక్ష్మునాయుడు, విశ్వం, రమణ, పార్వతీశ్వరరావుతో కలిసి బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు.
– న్యూస్‌టుడే, పార్వతీపురం పురపాలిక

పాల సేకరణ ధర పెంచాలని ఆందోళన



కాశాపేటలో రాస్తారోకో చేస్తున్న రైతులు

సీతానగరం, న్యూస్‌టుడే: పాల సేకరణ ధరలు పెంచాలని కోరుతూ శుక్రవారం కాశాపేట శీతలీకరణ కేంద్రం వద్ద ఉత్పత్తిదారులు ఆందోళన చేపట్టారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.కృష్ణమూర్తి ఆధ్వర్యంలో 36వ రాష్ట్ర రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ నెల 29న విశాఖ డెయిరీని ముట్టడిస్తామన్నారు. ధర తగ్గించడంతో రైతులు ఆర్థిక నష్టాలు చవిచూస్తున్నారన్నారు. రైతు సంఘం నాయకులు లక్ష్మునాయుడు, అప్పారావు, ఈశ్వరరావు, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక క్రమశిక్షణతో ప్రమాణాల మెరుగు



మాట్లాడుతున్న డీసీసీబీ ఏజీఎం భాస్కరరావు

వీరఘట్టం, న్యూస్‌టుడే: ఆర్థిక క్రమశిక్షణతో జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని డీసీసీబీ ఏజీఎం ఆర్‌కే భాస్కరరావు తెలిపారు. మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో ఎస్‌హెచ్‌సీలకు ఆర్థిక అక్షరాస్యతపై శుక్రవారం అవగాహన కల్పించారు. బ్యాంకు రుణాలను వ్యాపారాభివృద్ధికి వినియోగించాలన్నారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని పొదుపు చేయాలని సూచించారు. బ్రాంచి మేనేజర్ ఎస్‌.పార్వతి, సూపర్‌వైజర్ పి.క్రాంతికుమార్, వెలుగు ఏపీఎం కె.రాము పాల్గొన్నారు.

గోదాము నిర్వహణ తీరుపై అసంతృప్తి

పాచిపెంట, న్యూస్‌టుడే: పాచిపెంటలోని పౌరసరఫరాల గోదామును ఐటీడీఏ పీవో అశుతోష్ శ్రీవాస్తవ తనిఖీ చేశారు. సరకుల నిల్వలు, దస్త్రాలను చూసి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ నెలలో కందిపప్పు ఎందుకు పంపిణీ చేయలేదని అధికారులను ప్రశ్నించారు. సరిపడా సరకు రాలేదని సీఎస్‌డీటీ రంగారావు తెలిపారు. పద్మాపురం జీసీసీ డిపోకు కొన్ని నెలలుగా 14 క్వింటాళ్ల బియ్యం తక్కువగా వస్తుండటంతో రేషన్ కార్డులకు సరఫరా చేయడం లేదని లబ్ధిదారుడు ఈశ్వరరావు పీవో దృష్టికి తెచ్చారు. తహసీల్దారు రవి ఉన్నారు.

బోద బాధితుల గుర్తింపు సర్వే

బలిజిపేట గ్రామీణం, న్యూస్‌టుడే: పెదపెంకిలో బోదవ్యాధి బాధితుల గుర్తింపునకు బలిజిపేట పీహెచ్‌సీ వైద్యాధికారిణి క్రాంతికిరణ్మయి ఆధ్వర్యంలో సిబ్బంది సర్వే నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి లక్షణాలు ఉన్నవారి వివరాలు సేకరించారు. వైద్య సేవలు, పరిశుభ్రత గురించి అవగాహన కల్పించారు. ఇళ్ల పరిసరాల్లో మురుగు లేకుండా చూడాలన్నారు.

పీఆర్సీ కమిషన్ వేయాలి

పార్వతీపురం పట్టణం: ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయుల వేతనాల సవరణకు 12వ పీఆర్సీ కమిషన్‌ను నియమించాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మహేష్, బాలకృష్ణారావు కోరారు. గతేడాది జులై నుంచి వేతన సవరణ అమల్లోకి రాలేదన్నారు. ఉమ్మడి జిల్లాల పరిధిలో 7 నెలల పీఎఫ్ బకాయి రూ.100 కోట్ల మేర ఉందన్నారు.

నలుగురికి గాయాలు

పార్వతీపురం పట్టణం, గ్రామీణం, జియ్యమ్మవలస, గరుగుబిల్లి, న్యూస్‌టుడే: పార్వతీపురం శివారులో ఆటో ఢీకొనడంతో విద్యార్థికి గాయాలయ్యాయి. ఓ ప్రైవేటు పాఠశాల విద్యార్థి ఇంటికి వెళ్లేందుకు పట్టణానికి చెందిన యువకుడి ద్విచక్ర వాహనం ఎక్కాడు. ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొట్టడంతో విద్యార్థి కాలు విరిగింది. • జియ్యమ్మవలస మండలంలోని పెదమేరంగికి చెందిన టి.చంద్ర నడిచి వెళ్తుండగా వేగంగా వచ్చిన ద్విచక్ర వాహనం ఢీకొట్టడంతో గాయాలయ్యాయి. • గరుగుబిల్లి మండలంలోని తోటపల్లికి చెందిన ఆర్‌.ఎన్‌.కుమారి ఎంపీడీవో కార్యాలయంలో పనిచేస్తున్నారు. విధులు ముగించుకొని ఇంటికి వెళ్లాక పెద్దత్తతో గొడవ జరిగింది. ఘర్షణలో కుమారికి గాయాలయ్యాయి. • **పాలకొండ, గ్రామీణం:** యరకారాయపురానికి చెందిన పి.కైలాస్‌దొర ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా నాగావళి నదిలో నుంచి ఇసుకతో వస్తున్న ట్రాక్టరు ఢీకొంది. ఆయనకు గాయాలు కావడంతో పాలకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రయోగమూర్తి తెలిపారు.

ఎక్కడ చెత్త అక్కడే!

పాలకొండను వీడని సమస్య



కోనేరు గట్టుపై చెత్త నుంచి వెలువడుతున్న పొగ

పాలకొండకు డంపింగ్‌యార్డు తీరని సమస్యగా మారింది. నగర పంచాయతీగా ఆవిర్భవించిన నాటి నుంచి యార్డు ఏర్పాటుకు స్థలం సమకూరడంలేదు. ఇటు అధికారులు, అటు ప్రజాప్రతినిధులు పూర్తిస్థాయిలో దృష్టిసారించకపోవడంతో జనావాసాల మధ్యే చెత్త వేయాల్సి వస్తోంది. తాత్కాలిక అవసరాలు తీర్చేందుకు ఎక్కడ పడితే అక్కడ వేస్తున్నారు. పలుచోట్ల స్థలాలను పరిశీలిస్తున్నా ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది.
– న్యూస్‌టుడే, పాలకొండ, గ్రామీణం

ప్రజల నుంచి అభ్యంతరాలు..

అయిదేళ్ల క్రితం గాసివీధి సమీపంలోని చెరువును డంపింగ్ యార్డుగా వినియోగించేవారు. ప్రజలు రోగాల బారిన పడడంతో ఆందోళన మొదలైంది. తర్వాత నుంచి తెలుకలవాని చెరువు గట్టుపై వేస్తున్నారు. 1, 2, 12, 20 వార్డుల పరిధిలో ప్రజలు పొగతో ఇబ్బందులు పడలేక అడ్డగించారు. అనంతరం పాలకొండ- ఓని రహదారిలోని బత్తులవాని చెరువులో వేస్తే రైతుల నుంచి వ్యతిరేకత వచ్చింది. రెండు నెలలుగా పంచాయతీ కార్యాలయం ముందు వేస్తే ప్రజలు అభ్యంతరం తెలపడంతో వెంకటరాయుడి కోనేరు గట్టుకు తరలిస్తున్నారు.

కానరాని శాశ్వత పరిష్కారం..

పాలకొండలో డంపింగ్‌యార్డు ఏర్పాటుకు రూ.80 లక్షలు గతంలోనే మంజూరయ్యాయి. ప్రభుత్వ భూమిలో యార్డు ఏర్పాటుకు అధికారులు స్థలం గుర్తించేందుకు అయిదేళ్లుగా ప్రయత్నిస్తున్నా ప్రయోజనం లేకుండా పోతోంది. సిరికొండ, అట్టలికొండ, టీడీపారాపురం, సింగన్నవలస గ్రామాలకు సమీపంలో ప్రభుత్వ స్థలాలు ఉన్నాయి. అక్కడి ప్రజల నుంచి ప్రతిఘటన ఎదురైంది. దీనిపై కమిషన్ సర్వేశ్వరరావు మాట్లాడుతూ.. శాశ్వత డంపింగ్‌యార్డు ఏర్పాటుకు స్థల సమస్య ఉందన్నారు. పాలకవర్గంతో చర్చించి ప్రత్యామ్నాయం చూస్తామన్నారు



రహదారికి ఇరువైపులా పేరుకుపోయిన వ్యర్థాలు

చెరువు గట్టు అధ్వానం..

నెల రోజుల నుంచి వెంటరాయుడుకోనేరు గట్టుపై వ్యర్థాలు వేస్తున్నారు. దీనికి సమీపంలో జనావాసాలు ఉన్నాయి. ఇదే మార్గంలో ప్రభుత్వ ఆసుపత్రి, పలు వార్డుల ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. ఇటీవల గుర్తుతెలియని వ్యక్తులు చెత్తకు నిప్పంటించడంతో ఉక్కిరిబిక్కిరయ్యారు. కి.మీ మేర పట్టణంలో పొగ వ్యాప్తితో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

డీఈఈగా చాణిక్య

గుమ్మలక్ష్మీపురం: భద్రగిరి ఐటీడీఏ డిప్యూటీ ఇంజినీరు (డీఈఈ)గా టి.చాణిక్య బాధ్యతలు స్వీకరించారు. గతంలో పనిచేసిన డీఈఈ సింహాచలం సస్పెండ్ కావడంతో పోస్టు ఖాళీగా ఉంది. చింతపల్లిలో పనిచేస్తున్న చాణిక్య ఇక్కడకు వచ్చారు.

దేశమ్మ విగ్రహ ప్రతిష్ఠ

బలిజిపేట గ్రామీణం: అరసాడలో నిర్మించిన దేశమ్మ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ వేడుకగా నిర్వహించారు. కుంకుమ పూజలు చేసి ఘటాలను ఊరేగించారు.

శస్త్రచికిత్సలకు తరలింపు

కురుపాం గ్రామీణం: ముఖ్యమంత్రి నేత్ర సురక్షలో భాగంగా 28 మంది వృద్ధులను శస్త్ర చికిత్సలకు విజయనగరం తరలిస్తున్నట్లు జిల్లా నేత్ర వైద్యాధికారి జె.నగేష్‌రెడ్డి తెలిపారు. కురుపాం, గుమ్మలక్ష్మీపురంలో శిబిరాలు నిర్వహించి ఎంపిక చేశామన్నారు.

శుభ్రతపై అవగాహన

పార్వతీపురం గ్రామీణం: వ్యక్తిగత, ఇళ్ల పరిసరాలు శుభ్రంగా ఉంచాలని ఎంపీడీవో కె.రూపేష్ సూచించారు. బాలగుడబలో పర్యటించి కాలువల్లో పూడిక చూసి మహిళలకు అవగాహన కల్పించారు. విద్యుత్తు స్తంభాలపై వేలాడుతున్న తీగలను సరి చేయాలని కార్యదర్శికి సూచించారు.

సంతాపం

పార్వతీపురం పట్టణం: పట్టణానికి చెందిన విశ్రాంత అధ్యాపకుడు, ఎమ్మెల్యే విజయచంద్ర పెద్దనాన్న మరియదాసు గుండెపోటుతో గురువారం విశాఖలో కన్నుమూశారు. ఆయన భౌతికకాయాన్ని రామానంద్‌నగర్‌కు తీసుకువచ్చారు. ఎమ్మెల్యే విజయచంద్ర, మాజీ ఎమ్మెల్యే బి.చిరంజీవులు, మాజీ ఎమ్మెల్సీ డి.జగదీశ్వరరావు, పట్టణ ప్రముఖులు, కౌన్సిలర్లు, అధ్యాపకులు, ప్రిన్సిపాళ్లు నివాళులర్పించారు.

దశపత్ర కషాయంతో మేలు

వీరఘట్టం: దశపత్ర కషాయంతో కూరగాయలు, అరటి, వరి, పూల మొక్కల్లో రసం పీల్చే పురుగులు, తెగుళ్లు నివారించవచ్చని ఏవో సౌజన్య అన్నారు. అచ్చపువలసలో కషాయం తయారీపై రైతులకు అవగాహన కల్పించారు. సిబ్బంది ఉన్నారు.

రుణాలు వినియోగించుకోవాలి

పార్వతీపురం గ్రామీణం: తక్కువ వడ్డీతో ఏపీజీవీ బ్యాంకు అందిస్తున్న గృహ రుణాలు సద్వినియోగం చేసుకోవాలని ప్రాంతీయ కార్యాలయ సీనియర్ మేనేజర్ ప్రవీణ్ రెడ్డి కోరారు. పార్వతీపురంలో రుణాలు, కేంద్ర పథకాల గురించి వివరించారు. మేనేజర్ సాయి కుమార్, ఉద్యోగి మనోజ్ పాల్గొన్నారు.

పక్కాగా పశువుల గణన



గోడప్రతులు ఆవిష్కరిస్తున్న అధికారులు

పాలకొండ, న్యూస్‌టుడే: పశుగణన పక్కాగా చేపట్టాలని ఆ శాఖ ఏడీ మాణిక్యాలరావు ఆదేశించారు. శుక్రవారం పాలకొండలో గోడప్రతులు ఆవిష్కరించారు. 18,500 ఇళ్లలో సర్వే చేయనున్నట్లు చెప్పారు. తహసీల్దార్ బాలమురళీకృష్ణ, ఎంపీడీవో ఎం.వి.రంగారావు, పశువైద్యాధికారి సిద్ధార్థ తదితరులు పాల్గొన్నారు. • **జియ్యమ్మవలస:** మండలంలో 13,189 ఇళ్లలో పశుగణన చేపడుతున్నట్లు పశు వైద్యాధికారి ఎన్‌.మునికుమార్ తెలిపారు. సంబంధిత గోడప్రతులు విడుదల చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ బి.సురేష్, తెదేపా నాయకులు డి.లక్ష్మణరావు, డి.రామకృష్ణ సిబ్బంది పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదు విజయవంతానికి పిలుపు

సీతంపేట, న్యూస్‌టుడే: తెదేపా సభ్యత్వ నమోదును విజయవంతం చేయాలని రాష్ట్ర కార్యదర్శి కె.అప్పలనాయుడు అన్నారు. కె.గుమడలో మండలాధ్యక్షుడు సవర తోటముఖలింగం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. కార్యకర్తలు అందరూ పార్టీ సభ్యత్వాలు పొందాలన్నారు. నాయకులు పవన్, మాలయ్య, దమయంతినాయుడు, లక్ష్మయ్య, బాజన్న, కూర్మారావు, మన్మథరావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.



కె.గుమడలో సమావేశమైన తెదేపా నాయకులు

అద్దెలు చెల్లిస్తున్నా.. అభివృద్ధి లేదు



డీఎంతో మాట్లాడుతున్న సర్పంచి, గ్రామస్థులు

గుమ్మలక్ష్మీపురం, న్యూస్‌టుడే: ఆర్టీసీ కాంప్లెక్స్ సముదాయంలో దుకాణాలు ఏర్పాటు చేసి ప్రతి నెలా అద్దెలు చెల్లిస్తున్నా అభివృద్ధి మాత్రం చేయడం లేదని ఆర్టీసీ డీఎం దుర్గ వద్ద స్థానికులు వాపోయారు. శుక్రవారం గుమ్మలక్ష్మీపురం కాంప్లెక్స్‌ను డీఎం సందర్శించారు. కాంప్లెక్సులో పంకాలు, తాగునీటి సౌకర్యం లేవని సర్పంచి తెలియజేశారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని డీఎం తెలిపారు.

మత్తు పదార్థాల వినియోగంతో నష్టం

సాలూరు గ్రామీణం, న్యూస్‌టుడే: మత్తు పదార్థాల వినియోగంతో అనారోగ్యం బారిన పడతామని సీఐ అప్పలనాయుడు అన్నారు. శుక్రవారం సాలూరులో ఎంవీఐ ప్రసాద్ ఆధ్వర్యంలో కార్మికులకు అవగాహన కల్పించారు. విధి నిర్వహణలో మద్యం తాగకూడదన్నారు. ప్రమాదాల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్యాధికారి పి.నారాయణరావు వివరించారు. లారీ యాజమాన్య సంఘాధ్యక్షుడు గొర్లె మధు, ఎ.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



ప్రథమ చికిత్స గురించి వివరిస్తున్న వైద్యుడు నారాయణరావు

సమస్య పరిష్కరించాలని వినతి



వినతిపత్రం ఇస్తున్న కౌన్సిలర్, వీధివాసులు

పాలకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: పాలకొండ వెంకటరాయుడు కోనేరు గట్టుపై చెత్త వేయొద్దని స్థానికులు కోరుతున్నారు. నాలుగో వార్డు కౌన్సిలర్ కె.గుంగునాయుడు, మాజీ వార్డు సభ్యుడు పి.దవళేశ్వరరావు ఆధ్వర్యంలో వీధి ప్రజలు నగర పంచాయతీ కమిషనరు ఎస్‌.సర్వేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. చెత్తతో దుర్వాసన వ్యాప్తి చెందుతుందని, పొగ కారణంగా సమీపంలోని ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

రైతులకు అందుబాటులో ఉండాలి

సాలూరు గ్రామీణం, న్యూస్‌టుడే: రైతులకు వ్యవసాయ సిబ్బంది అందుబాటులో ఉండాలని జిల్లా వ్యవసాయ శిక్షణ కేంద్రం అధికారి ఆర్‌.శ్రీనివాసరావు సూచించారు. సాలూరులో నియోజకవర్గంలోని వ్యవసాయ, ఉద్యానశాఖ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. రబీ సీజన్లో పెసర, మినుములు, కొత్త వంగడాల ఎంపికపై ఏడీఏ భారతి వివరించారు. కేవీకే శాస్త్రవేత్త శ్రీనివాసరాజు, ఏడీఏ ఎం.మధుసూదనరావు, ఏవోలు అనూరాధ, తిరుపతిరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న శ్రీనివాసరావు